



కల్యాణంలో పాల్గొన్న ములుగు ఏఎస్పీ దంపతులు



ఉత్సవమూర్తులు

దన్వాడలో సీతారాముల కల్యాణోత్సవంలో మంత్రి శ్రీధర్‌బాబు

మోగింది.. కల్యాణ శుభవీణ

ఘనంగా రఘువంశ రామయ్య.. సుగుణాల సీతమ్మ పెళ్లి

- శ్రీరామ, హనుమాన్ ఆలయాలలో నవమి వేడుకలు
- ఊరూరా మార్మోగిన ఆలయాలు, మండపాలు
- ఉత్సవ విగ్రహాలతో శోభాయాత్ర
- భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో వెల్లివిరిసిన భక్తిపారవశ్యం

ములుగు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ఆకాశమంత పందిరి వేసి.. భూలోకమంతా ముగ్గులు వేసి.. వేద మంత్రాల నడుమ రఘువంశ రామయ్య, సుగుణాల సీతమ్మ కల్యాణాన్ని అంగరంగ వైభవంగా జరిపారు. శ్రీరామనవమి వేడుకలు ఆదివారం ములుగు జిల్లాలో కన్నుల పండువగా జరిగాయి. అభిజిత్ లగ్నమున వేద పండితులు వివాహ తంతు నిర్వహించారు. ములుగులోని శ్రీక్షేత్రం, రామాలయాలలో నవమి వేడుకలు జరిగాయి. మహ్మద్‌గౌస్‌పల్లి, జంగాలపల్లిలోని రామస్వామి గుట్టదగ్గర గల పురాతన హనుమాన్ దేవాలయాలలో వైభవంగా నిర్వహించారు. మల్లంపల్లి, చిన్నగుంటూరుపల్లి, దేవగిరిపట్నం, మదనపల్లి, జంగాలపల్లిలోని వెంకటేశ్వర స్వామి ఆలయాలలో అట్టహాసంగా వేడుకలు జరిపించారు. జీవంతరావుపల్లి, పాల్‌సాబ్‌పల్లిలో జరిగిన నవమి వేడుకల్లో గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ బానోతు రవిచందర్ పాల్గొన్నారు. వెంకటాపూర్, గోవిందరావుపేట, మంగపేట, తాడ్వాయి, ఏటూరునాగారం, వాజేడు, వెంకటాపురం, కన్నాయిగూడెం మండలాల్లో శ్రీరామనవమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. తీర్థప్రసాదాలతోపాటు ఆయా చోట్ల అన్నప్రసాద వితరణ కార్యక్రమం పెద్దఎత్తున జరిగింది. సాయంత్రం వేళ ఉత్సవ విగ్రహాలతో శోభాయాత్రలు నిర్వహించారు.

పోలీసుల బందోబస్తు

ములుగు, ఏటూరునాగారం పోలీసు సబ్‌డివిజన్‌లలో నవమి వేడుకల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ములుగు డీఎస్పీ రవీందర్, సీఐ శంకర్ నేతృత్వంలో పోలీసులు ఆలయాలను సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. ఏటూరునాగారం సబ్‌డివిజన్‌లో ఏఎస్పీ శివమ్ ఉపాధ్యాయ పర్యవేక్షణలో సీఐలు బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

భూపాలపల్లి జిల్లాలో..

● భూపాలపల్లిటౌన్ : శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవం జిల్లాలో ఆదివారం కన్నుల పండుగగా జరిగింది. జిల్లాలోని ప్రముఖ ఆలయాల్లో వేడుకలు ఘనంగా జరిగాయి. భక్తులు వేలాదిగా తరలివచ్చి శ్రీసీతారాముల కళ్యాణం చూసి తరించారు. మహాదేవపూర్ మండలంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక కళ్యాణ మండలంలో వైభవంగా కళ్యాణం జరిగింది. అలాగే గణపురం మండలంలోని రామాలయం, రామలింగేశ్వరస్వామి ఆలయం, చెల్పూరులోని కేటీపీపీ రామాలయం, భూపాలపల్లిలోని శ్రీసీతారామాం జనేయస్వామి ఆలయంలో, శ్రీభక్తాంజనేయస్వామి ఆలయంలో, రేగొండ మండలంలోని రావులపల్లి, రూపిరెడ్డిపల్లిలోని రామాలయంలో వేడుకలు జరిగాయి. అలాగే చిట్యాల మండలంలోని శ్రీప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో, నైన్‌పాక నాపాక దేవాలయంలో, కాటారంలోని ఆంజనేయస్వామి ఆలయం, ధన్వాడలోని దత్తాత్రేయస్వామి ఆలయం, బొప్పారంలోని శ్రీరామాంజనేయస్వామి ఆలయంలలో వేడుకలు జరుగుతాయి. మల్హర్ మండలంలోని తాడిచర్ల శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో ఘనంగా శ్రీరామనవమి వేడుకలు నిర్వహించారు. మహోత్సవానికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు గణపురం మండలం బుద్దారం గ్రామంలోని శ్రీరామాలయంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, పద్మ దంపతులు శ్రీసీతారాముల కల్యాణమహోత్సవం జరిపించారు. పట్టణంలోని సుభాష్‌కా లనీలో గల శ్రీసీతారా మాంజనేయ స్వామి ఆలయంలో జరిగే కళ్యాణ మహోత్సవానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, సింగరేణి జీఎం రాజేశ్వర్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు.





ఏటూరునాగారంలో శ్రీసీతారాముల కల్యాణంలో భక్తులకు స్వామివారి మంగళసూత్రాలు చూపిస్తున్న అర్చకుడు



కల్యాణమహోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపాలపల్లి గండ్ర సత్యనారాయణరావు

ధన్వాడలో ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి

కాటారం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : సొంత గ్రామమైన దన్వాడలో శ్రీసీతారాముల కల్యాణోత్సవంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పాల్గొన్నారు. దేవేరుల కళ్యాణానికి మంత్రి శ్రీధర్‌బాబు తన తల్లి జయశ్రీ, సోదరుడు దుద్దిళ్ల శ్రీనుబాబు దంపతులు, వందలాదిమంది భక్తులతో కలిసి తమ స్వగృహం నుంచి ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు తీసుకెళ్లి సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ సీతారాముల ఆశీస్సులతో యావత్ తెలంగాణ రాష్ట్ర ప్రజానీకం, మ ంథని నియోజక వర్గ ప్రజలు బాగుండాలని కోరుకు న్నట్లు తెలిపారు.

అడ్డుకునేదెవరు..?

- ఇష్టానుసారంగా సాగుతున్న ఇసుక దందా
- నంబర్‌ప్లేట్ లేకుండా ఓవర్‌స్పీడ్‌తో రవాణా
- అనుమతి పేరిట ఒక్కో ట్రాక్టర్‌కు రూ .6వేలు ?
- పగలు, రాత్రి తేడా లేకుండా సాగుతున్న దందా
- అడుగంటిపోతున్న భూగర్భ జలాలు



జిల్లా కేంద్రంలో దర్జాగా రవాణా అవుతున్న ట్రాక్టర్లు

కృష్ణకాలనీ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. అడిగేవారు మామూలుగా తీసుకుంటుండడంతో అక్రమ దందా మూడు పువ్వులు.. ఆరు కాయలుగా నడుస్తోంది. వాగులు, వంకల నుంచి పగలు, రాత్రి అనే తేడాలు లేకుండా అక్రమార్కులు ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ప్రధానంగా భూపాలపల్లి మండల పరిధిలో ఈ దందా సాగుతుండగా జిల్లా కేంద్రానికి, వివిధ గ్రామాలకు ఇసుక యథేచ్ఛగా సరఫరా జరుగుతోంది. రెవెన్యూ, అటవీ అధికారుల కనుసన్నల్లోనే దందా నడుస్తున్నట్లు విమర్శలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి.

నెంబర్ ప్లేట్ ఉండదు.. నెమ్మదిగా వెళ్లరూ..!

ఇసుక రవాణా చేసే వ్యక్తులు వారివారి ఏ ఒక్క ట్రాక్టర్‌కు కూడా నెంబర్ ప్లేట్ ఉండదు. అది పాత ట్రాక్టరైనా.. కొత్త ట్రాక్టరైనా ఇదే విధానం సాగిస్తుంటారు. రోజుకు పదుల సంఖ్యలో ఇసుక వాహనాలు రయ్‌మంటూ వెళ్తున్నాయి. ప్రధానంగా తెల్లవారుజామున ట్రాక్టర్ల మోత ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోంది. మరోవైపు ఇసుకను తరలిస్తున్న వాహనాలను చాలా వరకు మైనర్లు సైతం నడుపతున్నట్లు తెలిసింది. ఓవర్ స్పీడ్‌తో వెళుతూ ఇతర వాహనదారులను, ప్రజలన భయాందోళనకు గురి చేస్తున్నట్లు ప్రజలు వాపోతున్నారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోననే ఆందోళన వ్యక్తమవుతోంది. ఇసుక దందాను అరికట్టే నాథుడే లేడని వివిధ గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

ఇక్కడి నుంచే సరఫరా..

ఇసుక అక్రమ రవాణా రోజురోజుకు విస్తరిస్తోంది. భూపాలపల్లి మండలంలోని బొగ్గులవాగు, తీగలవాగు, దూదేకులపల్లి శివారులోని పెద్దవాగు, చిన్నవాగు, గొల్లబుద్దారం సమీపంలో గద్దకుంట వాగు, మోరంచపల్లి వాగుల నుంచి ఇసుక యథేచ్ఛగా జిల్లా కేంద్రానికి సరఫరా జరుగుతోంది. వీటి నుంచి సరఫరా అయ్యే ఇసుకను రూ.2500 విక్రయిస్తున్నట్లు సమాచారం.. దీంతో పాటు చిట్యాల మండలంలోని కాల్వపల్లి ఇసుకను జిల్లా కేంద్రంతో పాటు భూపాలపల్లి మండలంలోని గొర్లవీడు, కొంపెల్లి, నేరేడుపల్లి, వజినెపల్లి, కొత్తపల్లి ఎస్ఎం, మోరంచపల్లి గ్రామాలకు ఇసుకను జోరుగా రవాణా చేస్తున్నారు. ఇందుకు గాను ఇసుక అవసరమైన వారికి ఓక్కో ఇసుక ట్రాక్టర్ లోడుకు రూ.4500 చొప్పున దండుకుంటున్నట్లు తెలిసింది. ఇదీ తెల్లవారుజామున అధికంగా సరఫరా జరుగుతుందన్న విషయం బహిరంగ రహస్యమే.

ఒక్కో ట్రాక్టర్‌కు నెలకు రూ. 6వేలు?

ఇసుక దందా సాగించాలంటే అధికారుల చేతులు తడపాల్సిందేన నే ఆరోపణలు అక్రమార్కులు బహిరంగంగానే చెబుతున్నారు. అధికారుల అండ లేకుంటే దందా ఎలా సాధ్యమనే ప్రశ్న సైతం తలెత్తుతోంది. ఇందులో భాగంగానే వాగుల నుంచి ఇసుక తీసుకెళ్లడానికి.. దర్జాగా రవాణా చేసుకునేందుకు అధికారులకు మామూళ్లు ముడుతున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఇందులో ప్రధానంగా రెవెన్యూతో పాటు అటవీ అధికారులకు ఒక్కో ట్రాక్టర్‌కు నెలకు రూ.6 వేల రూపాయలు చెల్లిస్తున్నట్లు సమాచారం. భూపాలపల్లి మండల పరిధిలో సుమారు50కి పైగా ఉన్న ట్రాక్టర్ యజమానులు అటు రెవెన్యూ.. ఇటు అటవీ అధికారులను మచ్చిగ చేసుకున్న పిదపనే ఈ అక్రమ వ్యాపారాల్ని సాగిస్తున్నట్లు బహిరంగ విమర్శలు వస్తున్నాయి. ఇసుక అక్రమ రవాణాపై అధికారులకు ఫిర్యాదులు అందినా నిమ్మకుండిపోతారనే ఆరోపణలు సైతం గుప్పుమంటున్నాయి.



కిరాణసామాను, కుట్టు మిషన్ అందిస్తున్న సంస్థ నిర్వాహకులు

కౌలు రైతు కుటుంబానికి చేయూత

కాటారం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి) : కాటారం మండలకేంద్రానికి చెందిన బొడ్డు సంజీవ్ అనే కౌలురైతు అప్పులబాధతో గత ఏడాది ఆత్మహత్యకు పాల్పడగా ఆ కుటుంబానికి రూరల్ డెవలప్‌మెంట్ సర్వీస్ సొసైటీ, రైతు స్వరాజ్యవేదిక నిర్వాహకులు చేయూతన ందించారు. ఆదివారం సంజీవ్ కుటుంబ సభ్యులకు ఆర్‌డీఎస్ఎస్ నిర్వాహకులు కుట్టు మిషన్ అం దించడంతో పాటు కిరాణా షాపు పెట్టించారు. వీటిని రైతు స్వరాజ్యవేదిక జిల్లా కన్వీనర్ కర్నాటకపు సమ్మయ్య సంజీవ్‌కుటుంబసభ్యులకు అందించారు. ఈ సందర్భంగా సమ్మయ్య మాట్లాడుతూ పంటల పెట్టుబడి మీద 50శాతం అదనపు ఆదాయం వచ్చేలా ప్రభుత్వాలు మద్ధతు ధరలు కల్పించి చట్టబద్ధత చేయాలని డిమాండ్ చేశారు. రైతు ఆత్మహత్యలపై త్రిసభ్య కమిటీ ద్వారా నివేదికలను తెప్పించుకుని ప్రభుత్వం ఆ కుటుంబాలకు రూ.6లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాల న్నారు. ఈ కార్యక్రమంలో రైతు స్వరాజ్య వేదిక రాష్ట్ర, జిల్లా నాయకులు కొండాల్‌రెడ్డి, ఐలయ్య, చల్లగురుగుల సంజీవ్ తదితరులు ఉన్నారు.

ఆదివాసీల జాతరకు ఆదరణ కరువు..

- బీరమయ్య జాతరను పట్టించుకోని వైనం
- సౌకర్యాలు లేక భక్తులు ఇక్కట్లు
- ఆలయ కమిటీ కృషితోనే అరకొర సౌకర్యాలు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు
- ఈ నెల 12 నుంచి ప్రారంభం కానున్న బీరమయ్య జాతర





మొక్కులు తీర్చుకునేందుకు వస్తున్న భక్తులు(ఫైల్), బీరమయ్య గద్దె



జాతరలో భక్తుల రద్దీ (ఫైల్)

వాజేడు, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): తెలంగాణ-చత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతంలో అత్యంత ప్రసిద్ధి చెందిన బీరమయ్య జాతరకు చాలా విశిష్టత ఉంది. పూర్తి గిరిజన సంప్రదాయం ప్రకారం ఎంతో వైభోపేతంగా బీరమయ్య జాతర జరుగుతోంది. మూడు రోజుల పాటు జరిగే ఈ జాతర ఏజెన్సీ ప్రాంతంతో పాటు చత్తీసగఢ్ రాష్ట్రం నుంచి అనేక మంది భక్తులు బీరమయ్యను దర్శించుకునేందుకు తరలివస్తారు. బీరమయ్యను బీష్మశంకరుడిగా పిలుచుకునే స్థానికులకు బీరమయ్యకు సరైన ఆదరణ లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివాసీలు ఎంతో ఇష్టంగా జరుపుకునే జాతర ఆదరణ నోచుకోవడం లేదు. కాగా ఈ జాతర ఈ నెల 12 నుంచి ప్రారంభం కానుంది.

మూడు రాష్ట్రాల జాతర..

తెలంగాణ-చత్తీస్‌గఢ్ బోర్డర్‌లో జరిగే ఈ జాతరకు తెలంగాణ, చత్తీస్‌గఢ్, మహరాష్ట్రల నుంచి భక్తులు వస్తుంటారు. కోరిన కోర్కెలు తీర్చే దైవంగా భక్తులకు ప్రగాడ విశ్వాసం ఉంది. మండలంలోని టేకులగుడెం పంచాయతీ పరిధిలోని లొటపెటగండి వద్ద ఈ బీరమయ్య జాతరను స్థానిక గిరిజనులు ప్రతి ఏటా నిర్వహిస్తారు. జాతర జరిగే మొదటి, రెండో రోజున సుమారు ఇరవై వేల మందికి పైగా భక్తులు వస్తారని అంచానా ఉంది. వాజేడు, వెంకటాపురం(నూగూరు), మండలాలతో పాటు అవతలి ఒడ్డున ఉన్న కన్నాయిగుడెం మండలం నుంచి గోదావరి లో నాటు పడవల సాయంతో ఇవతలి చేరుకొని భక్తులు తమ మొక్కులను చెల్లించుకుంటారు. సుమారు 40 ఏళ్లకు పైగా జరుగుతున్న ఈ జాతరను కృష్ణాపురానికి చెందిన గిరిజనులు నిర్వహిస్తారు. జాతర జరిగే మూడు రోజులు స్థానిక యువత వలంటీర్లుగా వ్యవహరిస్తూ ఎటువంటి అవాంచనీయ ఘటనలు చోటు చేసుకోకుండా వ్యవహరిస్తారు.

సౌకర్యాలు లేక భక్తులు ఇక్కట్లు..

సరిహద్దు ప్రాంతంలో జరిగే బీరమయ్య జాతరకు సరైన సౌకర్యాలు కల్పించడంలో ప్రజాప్రతినిధులు, అధికారులు విఫలమైయ్యారు. పూర్తి ఆదివాసీ ప్రాంతమైనప్పటికి ఆదివాసీ ప్రజాప్రతినిధులకు బీరమయ్య అభివృద్ధిపై పట్టింపు లేకుండా పోయిందని విమర్శలు ఉన్నాయి. 163వ జాతీయ రహదారి నుంచి బీరమయ్య ఆలయంకు చేరుకోవలంటే సుమారు కిలోమీటరు మేర గుట్టపై నడవాల్సి ఉండటంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సరైన రహదారి ఏర్పాటు చేస్తే ఆలయం మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉందని స్థానికులు వాపోతున్నారు. అలాగే జాతర జరిగే మూడు రోజులు భక్తులకు తాగునీటికి ఇబ్బందులు ఎదురువతున్నాయి. పక్కనే ఉన్న గోదావరి నుంచి మోటార్ల ద్వారా నీటిని సరఫరా చేస్తుండటంతో కలుషిత నీటిని తాగడంతో అనారోగ్యానికి గురయ్యే అవకాశాలు ఉన్నాయి. బీరమయ్యను దర్శించుకునేందుకు వచ్చే భక్తులు స్నానాలు చేసేందుకు ఏర్పాట్లు లేకపోవడంతో ప్రమాదకరంగా ఉండే గోదావరిలోనే స్నానాలు చేయాల్సి వస్తుందని, కరకట్ట లాంటి నిర్మాణం చేపడితే బాగుంటుందని స్థానికులు కోరుతున్నారు. ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసినప్పటికి అవి అరకొరగానే అందుబాటులోకి వస్తున్నాయి.

ఆలయ నిర్మాణం చేపట్టాలి..

గుట్టలపై వెలసిన బీరమయ్యకు ఆలయం నిర్మాణం చేపట్టాలని స్థానిక గిరిజనులు తమ వాదనను ఎన్నో ఏళ్ల నుంచి వినిపిస్తున్నారు. గతంలో కృష్ణాపురం పంచాయతీలోని నాలుగు గ్రామల ప్రజలు కొంత మేర నిధులు సమకూర్చుకొని గుడి నిర్మాణం చేపట్టారు. ఆ నిధులు సరిపోకపోవడంతో చిన్న గదిలాంటి నిర్మాణం చేపట్టి వదిలేశారు. అప్పటి నుంచి ఆ గదిలోనే బీరమయ్యకు పూజారులు పూజలు నిర్వహిస్తారు. గతంలో భద్రాచలం ఐటీడీఏ రూ 5 లక్షలు మంజూరు చేసినట్లు ప్రచారం జరగడంతో కొంత మేర సంతోషం వ్యక్తం చేసిన స్థానికులు ఆ హామీ వట్టి ప్రచారం మాత్రమేనని తెలుసుకోవడంతో నిరాశకు లోనయ్యారు. ఇప్పటికైనా బోర్డర్‌లో ఉన్న బీరమయ్య జాతరను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తే చాలా అభివృద్ధి చెందే అవకాశం ఉందని, ప్రజాప్రతినిధులు ఈ విషయం పై దృష్టి సారించాలని కోరుతున్నారు.

కనీస సౌకర్యాలైన తాగునీరు, మరుగుదొడ్లు, రహదారి నిర్మాణం చేపట్టాలని ఆలయ పూజారులు కోరుతున్నారు. రాష్ట్ర మంత్రి ములుగు శాసన సభ్యురాలు సీతక్క సైతం గతంలో బీరమయ్యను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్న సందర్భాలు ఉన్న నేపథ్యంలో జిల్లా మంత్రి ప్రత్యేక దృష్టి సారించి బీరమయ్య వద్ద కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

రాజ్యాంగం పుస్తకం కాదు.. పవిత్ర గ్రంథం..

- రాజ్యాంగ పరిరక్షణ కోసం పాదయాత్ర
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, కాంగ్రెస్ నాయకులు

భూపాలపల్లిటౌన్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగం పుస్తకం కాదు.. ఒక పవిత్ర గ్రంథం.. అని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. భూపాలపల్లి పట్టణంలోని 7, 26వ వార్డులలో రాజ్యాంగ పరిరక్షణ కోసం ఆదివారం పాదయాత్ర చేశారు. ముందుగా మహాత్మాగాంధీ, అంబేద్కర్, పూలే చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మన దేశ రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రాజ్యాంగ విలువలపై ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అయినప్పటికీ పేద, బలహీన వర్గాల ప్రజల ఆకాంక్షలు నెరవేరడం లేదని అన్నారు. ప్రధానమంత్రికి పేద ప్రజల కంటే బడా బాబులు ముఖ్యమన్నారు. రాజ్యాంగం ఒక పుస్తకం మాత్రమే కాదని, దానిని అంబేద్కర్, గాంధీ, పూలే లాంటి గొప్పవాళ్ల ఆలోచనలతో తయారు చేయబడిన ఒక పవిత్ర గంథమని అన్నారు. కానీ, పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగాన్ని బీజేపీ పార్టీ అణగదొక్కాలని చూస్తుందని అన్నారు. అమిత్‌షా అంబేద్కర్‌ను పార్లమెంట్ సాక్షిగా అవమానించారన్నారు. గ్రామ, మండల స్థాయిలో ఈ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కోరారు. గాంధీ, అంబేద్కర్ ఆశయాలను సిద్ధాంతాలను దేశంలో అమలు చేయాల్సిన సమయం వచ్చిందన్నారు. ఈ పాదయాత్రలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్, మాజీ కౌన్సిలర్లు దాట్ల శ్రీనివాస్, హారిక, శ్రీనివాస్, స్వామి, నాయకులు బుర్ర కొంరయ్య, మధూకర్‌రెడ్డి, రమేష్, రవి పాల్గొన్నారు.

పద్య సాహితీవేత్తకు సత్కారం



లక్ష్మయ్యను సన్మానిస్తున్న నిర్వాహకులు, కవులు

కాటారం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన పద్య సాహితీ వేత్త, జయశంకర్ సారస్వత సమితి వ్యవస్థాపకుడు గడ్డం లక్ష్మయ్యకు తెలంగాణ పద్య సారస్వత పీఠం నిర్వాహకులు ఉత్తమ సాహితీవేత్త పురస్కారంతో సత్కరించారు. ఆదివారం హైదరాబాద్‌లోని కల్చరల్ సెంటర్‌లో ప్రసిద్ధిచెందిన తెలుగు పద్యకవులచే రాయబడిన 'పద్య వైభవం' గ్రంథం ఆవిష్కరణ జరిగింది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 200 మందికి పైగా సమకాలీన పద్యకవులు రాసిన ఈ గ్రంథంలో గడ్డం లక్ష్మయ్య పద్యమే కవిత్వం శీర్షికన రాసిన పంచపద్య రత్నాలు అనే పద్య సాహిత్యం ముద్రించబడింది. దీంతో పద్య సారస్వత పీఠం నిర్వాహకులు లక్ష్మయ్యను సత్కరించారు. ఈ కార్యక్రమంలో అష్టావధానులు భాను ప్రకాష్, దత్తాత్రేయశర్మ, సాహితీ వేత్తలు వెంకటరెడ్డి, గౌరిశంకర్, మృత్యుంజయ శర్మ, శ్రీధర్, గోవర్ధనరాజు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలతో సహవాసం

- తొర్రూరు మునిసిపాలిటీలో మౌలిక వసతులు కరువు
- ఇబ్బందులు పడుతున్న పట్టణ ప్రజలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



పట్టణంలో వృథాగా ఉన్న వ్యవసాయ మార్కెట్ యార్డు

తొర్రూరు (మహబూబాబాద్ జిల్లా), ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : తొర్రూరు మునిసిపాలిటీ ఏర్పడి ఏడేళ్లు పూర్తవుతున్నా సరైన మౌలిక వసతులు కల్పించడంలో అటు అధికారులు, ఇటు ప్రజా ప్రతినిధులు పూర్తిగా విఫలమయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పాలకుర్తి నియోజకవర్గంలో ఉన్న ఏకైక మునిసిపాలిటీ తొర్రూరులో కాలనీల్లో ఎక్కడపడితే అక్కడ చెత్త, రోడ్లపై మురుగునీరు, తగిన వసతులు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నియోజకవర్గానికి రెండు సార్లు ఎమ్మెల్యేగా, మరోసారి గెలిచి మంత్రి అయిన దయాకర్‌రావు ప్రాతినిధ్యం వహించినా అభివృద్ధి లేదు. గత ప్రభుత్వం నూతన మునిసిపాలిటీలకు నిధులు కేటాయించినా వృథాగా పోయాయి.

వృథాగా ఏబీసీ సెంటర్

కుక్కలు, కోతులను నియంత్రించేందుకు ఏర్పాటు చేసిన ఎనిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రం వృథాగా ఉంటుంది. రూ.20లక్షల మునిసిపాలిటీ నిధులతో నిర్మించి వదిలేశారు. ప్రారంభించిన మొదట్లో కుక్కల నియంత్రణ కోసం ఆపరేషన్‌లు చేశారు. కానీ, సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో వృథాగా మారింది. పట్టణంలో కుక్కలు, కోతులబెడద తీవ్రంగా ఉన్న నేపథ్యంలో అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



తాళంవేసి ఉన్న ఏబీసీ సెంటర్

వృథాగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్

పట్టణంలో ప్రధానంగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మించినా మాంసం, చేపల విక్రయాలు చేపట్టడానికి ఏర్పాటు చేసిన ఫ్లోర్ వృథాగా ఉంటుంది. కూరగాయల విక్రయాలు మాత్రమే కొనసాగుతున్నాయి. చిరు వ్యాపారులు మెయిన్ రోడ్డుపైనే మాంసం, చేపల విక్రయాలు చేపడుతున్నారు. కోట్లు వెచ్చించి నిర్మించినా అది అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది.

అలంకార ప్రాయంగా వ్యవసాయ మార్కెట్

డివిజన్ పరిధిలోని ఐదు మండలాలకు చెందిన రైతులు పండించిన పంటలు విక్రయాలు చేపట్టేందుకు సుమారు 20ఏళ్ల కిందట మార్కెట్ ఏర్పాటు చేసినా కొనుగోళ్లు లేకపోవడంతో వృథాగా ఉంటోంది. దానికి అనుగుణంగా గోడౌన్‌లు ఏర్పాటు చేసినా సివిల్ సప్లై సరుకులకు ఉపయోగపడుతోంది. మార్కెట్‌లో కొనుగోళ్లు లేకపోవడంతో యార్డు, మార్కెట్ అలంకారప్రాయంగా మిగిలిపోయింది. చెక్‌పోస్టుల ద్వారా ఆదాయం వస్తున్నా కొనుగోళ్లు చేపట్టడం లేదు. కొనుగోళ్లు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

నిలిచిన మినీ ట్యాంక్‌బండ్ పనులు

పట్టణంలోని పెద్ద చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా ఏర్పాటు చేస్తూ గత ప్రభుత్వంలో సుమారు రూ.5కోట్ల నిధులు వెచ్చించినా సంబంధిత కాంట్రాక్టర్ మధ్యలో వదిలేయడంతో వృథా అయిపోయింది. చెరువు కట్టపై వాకింగ్ ట్రాక్, పార్కు, చెరువులో బోటు సదుపాయం తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలనే లక్ష్యంతో నిధులు మంజూరైనా పనులు కొనసాగడం లేదు. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం సరికాదని ప్రజలు అంటున్నారు.

వృథాగా ఐకేపీ భవనం

పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం వెనక 2018లో మహిళా సంఘాల బలోపేతం కోసం ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో నూతన భవనం నిర్మించినా కార్యకలాపాలు కొనసాగకపోవడంతో వృథా గా మారిపోయింది. ఆ భవనంలో ఈజీఎస్, మహిళా సంఘాల నిర్వహణ చేపట్టాలని ఆదేశాలు ఉన్నా వాడ డం లేదు. భవనం వాడుక లో లేకపోవడం వల్ల చుట్టూ చెట్లుపెరిగి అసాంఘిక కార్య కలాపాలకు అడ్డాగా మారిం ది. ఈ భవనంలో ఈజీఎస్ కు సంబంధించిన రికార్డులు, ఎలక్షన్‌కు సంబంధించిన బ్యాలె ట్ బాక్స్‌లు, ఇతర సామగ్రి నిలువ ఉంచినట్లు అధికారులు చెప్తున్నారు.

కలగానే అగ్నిమాపక కేంద్రం

తొర్రూరు డివిజన్, మునిసిపాలిటీగా ఏర్పడినా అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు కలగానే మిగిలిపోయింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి అధికారంలోకి వచ్చిన ఎమ్మెల్యేలందరూ హామీలిస్తున్నారే తప్ప ఏర్పాటు చేయడంలో శ్రద్ధ చూపడం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు వరంగల్, మహబూబాబాద్ నుంచి అగ్నిమాపక వాహనం వచ్చే లోపు ప్రమాదం జరిగిపోతుంది. సంబంధిత ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు.

ట్రాఫిక్ ఇబ్బందులు

తొర్రూరు పట్టణంలో ట్రాఫిక్ ఇబ్బందులు తీవ్రంగా ఉన్నాయి. పట్టణం జాతీయ రహదారిపై ఉండడంతో వాహనాలన్నీ పట్టణంలో నుంచి వెళ్తుండడంతో సమస్య తీవ్రంగా ఉంది. ట్రాఫిక్ నియంత్రణకు మునిసిపాలిటీ నుంచి రూ.20లక్షలతో సిగ్నల్స్ ఏర్పాటు చేసినా వృథాగా మారాయి. ట్రాఫిక్ పోలీసులు లేకపోవడం, సిబ్బంది కొరతతో పోలీసులు ట్రాఫిక్ నియంత్రణపై శ్రద్ధపెట్టడం లేదనే ఆరోపణలున్నాయి.

లీకేజీలు, రోడ్లపైకి మురుగునీరు



పట్టణంలో రోడ్డుపై వృథాగా పోతున్న భగీరథ నీరు

పట్టణంలో ప్రధాన సమస్య తాగునీటి పైప్‌ల లీకేజీతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల డ్రైనేజీల నిర్మాణం చేపట్టడంతో పైప్‌లు పగిలిపోయి రోడ్లపై భగీరథ నీరు వృథాగా పోతోంది. ఎండాకాలంలో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. కొన్ని కాలనీల్లో రోడ్లపైకి మురుగునీరు చేరి చెరువును తలపిస్తున్నాయి. అధికారులకు పట్టణ ప్రజలు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినా పట్టిం చుకోవడం లేదని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రధాన రహదారిపై ఉన్న సెంట్రల్ లైటింగ్‌లు వెలగకపోవడంతో రాత్రిపూట వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కాగు నవీన్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి



పట్టణంలో కనీస మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. నిధులున్నా పనులు చేపట్టకపోవడం సరికాదు. పట్టణంలో ప్రధానంగా ఉన్న లీకేజీలు, రోడ్లపై మురుగునీరు, తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలి. కేంద్ర ప్రభుత్వం అమృత్ పథకం ద్వారా నిరంతరం తాగునీరు అందించేందుకు నిధులు కేటాయించినా అధికారుల వైఫల్యంతో పనులు పూర్తికావడం లేదు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తొర్రూరు సమస్యలు పరిష్కరించాలి.

సరస్వతీ మాతా పాహిమాం..

- నదిలో స్నానమాచరిస్తే కోటి ఫలితాలు
- ముక్కోటి దేవతలు పుష్కరాల్లోనే..



కాళేశ్వరంలోని గోదావరి నది

మహదేవపూర్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మహదేవపూర్ మండలం కాళేశ్వర ముక్తీశ్వర త్రివేణి సంగమ గోదావరిలో మే 15 నుంచి సరస్వతి పుష్కరాలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు, ఇతర అధికారులు అన్ని ఏర్పాట్లు నిర్వహిస్తున్నారు. అయితే తెలంగాణలోని కాళేశ్వరం ముక్తీశ్వర స్వామి త్రివేణి సంగమంలో గోదావరి, ప్రాణహిత, సరస్వతి మూడు నదులు కలుస్తాయి. అలహాబాద్‌లో గంగా, యమున, సరస్వతి కలవడం ఈ రెండు చోట్లనే సరస్వతి పుష్కరాలు ఉండడం విశేషం. పుష్కరాల సమయంలో ముక్కోటి దేవతలు పుష్కరనదిలోనే దర్శనమిస్తారని ప్రతీతి. కాళేశ్వరం గోదావరి స్నానాలు ఆచరించి కాళేశ్వరం ముక్తీశ్వరస్వామిని దర్శించుకుంటే కోటి ఫలితాలు వస్తాయని నమ్మకం. కోరిన కోరికలు తీర్చే కాళేశ్వర ముక్తీశ్వరుడు, సరస్వతీదేవి, శుభానంద దేవి ఉండడం విశేషం. కాళేశ్వరం నాలుగు ద్వారాలు నాలుగు నందులు ఉండడం విశేషం. ఎక్కడా కూడా ఏ దేవాలయాలకు కూడా నాలుగు ద్వారాలు లేవు. ఒక కాళేశ్వరంలోనే ఉండడం, ఒకే పానవట్టంపై రెండు లింగాలు ఉండడం ఇక్కడ ప్రత్యేకత. అయితే కాళేశ్వరంలో ఈ సరస్వతి పుష్కరాలలో స్నానాలు ఆచరించి దాన ధర్మాలు చేసి స్వామి వారిని దర్శించుకుంటే ముక్తిని పొందుతారని నమ్మకం. దీంతో యావత్ భారతదేశం నుంచి భక్తులు అధిక సంఖ్యలో సరస్వతి పుష్కరాల్లో స్నానాలు ఆచరించి స్వామి వార్లను దర్శించుకుంటారు.

మరో ప్రాముఖ్యత ఏమిటంటే నవగ్రహ పూజలు, శని త్రయోదశి పూజలు వేల సంఖ్యలో ప్రతీ గురువారం, శనివారం, మంగళవారం చేస్తుంటారు. ఈ మూడు రోజుల్లో పెళ్లి గాని పిల్లలు, యువకులు, సంతానం లేని వారు కాళేశ్వరంలో ఈ పూజలు నిర్వహించుకుంటే వీళ్లందరికి ఫలితాలు జరిగాయని రోజు రోజుకు ఈ పూజలు కాళేశ్వరంలో పెరుగుతున్నాయి.

అక్రమ నిర్మాణం చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న దేవేందర్

చిన్నగూడూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): తమ స్థలంలో అక్రమంగా ఇంటి నిర్మాణం చేస్తున్న వారిపై అధికారులు చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని పుచ్చకాయల దేవేందర్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక విలేకరులతో దేవేందర్ మాట్లాడుతూ.. మండల కేంద్రంలోని సర్వే నెం 3ఇ, 4ఏలో గల 35 గుంటల భూమిని చిన్నగూడూరుకు చెందిన ప్రదీప్ చంద్ర వద్ద 2023లో కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించామని తెలిపారు. కాగా, తాను స్థానికంగా లేకపోవడంతో అదే గ్రామానికి చెందిన శంకరయ్య తమ అనుమతి లేకుండా తమ స్థలంలో రెవెన్యూ అధికారులు నిర్ణయించిన హద్దు రాళ్లు తొలగించి ఇంటి నిర్మాణం చేస్తుండడంతో స్థానిక తహసీల్దార్, గ్రామ పంచాయతీలో ఫిర్యాదు చేసి, భూమి దగ్గరకు వెళ్లగా తమపై దాడి చేసి కులం పేరుతో దుషించారని వివరించారు. అధికారులు స్పందించి విచారణ జరిపి అతనిపై చర్యలు తీసుకొని, తమకు న్యాయం చేయాలని వేడుకున్నాడు.

ఆదివాసీలపై దాడులు అరికట్టాలి

తొర్రూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలపై జరుగుతున్న దాడులు తక్షణమే నిలిపివేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వెంకన్న అన్నారు. ఆదివారం డివిజన్ కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ఆదివాసీలపై ప్రభుత్వాలు, దాడులు, హత్యాకాండ చేయించడం సరికాదని, అడవుల్లో సహజ అటవీ, ఖనిజ సంపదను ప్రభుత్వాలు బడా కార్పొరేట్‌లకు దోచిపెట్టడం కోసమేనని విమర్శించారు. ప్రతిఘటించిన ఆదివాసీలను హత మారుస్తున్నారని, జల్ జంగల్ జమీన్ ఆదివాసీలదే అని, అడవులపై పూర్తిహక్కులు ఆదివాసులకే దక్కాలని డిమాండ్ చేశారు. ఈనెల 20న జిల్లా కేంద్రంలో జరిగే ఏఐకేఎంఎస్ సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలకుంట్ల సాయిలు, భిక్షపతి, శ్రీకాంత్, యాకూబ్, రాములు, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు

రణదీవే ఆశయాలను కొనసాగించాలి

ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : కార్మిక ఉద్యమ నాయకుడు, సీఐటీయూ అఖిల భారత వ్యవస్థాపక అధ్యక్షుడు బీటీ రణదీవే ఆశయాలను కొనసాగిద్దామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ అన్నారు. ములుగులో ఆదివారం రణదీవే 35వ వర్ధంతి జరగగా రాజేందర్ పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చాక రణదీవే ఉమ్మడి కార్మికవర్గ ఉద్యమంలో సంస్కరణ ధోరణిని వ్యతిరేకించి 1970లో ఐక్యత, పోరాటం అనే నినాదంతో సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్(సీఐటీయూ) స్థాపించారని అన్నారు. కార్మికవర్గ రాజ్య స్థాపన కోసం పనిచేయడం, కార్మిక వర్గాన్ని ఐక్యంగా నిలబెట్టడం, కార్మికవర్గాన్ని ఒక వర్గంగా ఐక్యం చేయడమే రణదీవేకు ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. ఈకార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఆర్.నీలాదేవి, సీఐటీయూ మండల నాయకులు సద్దాంహుస్సేన్, నారాయణ, డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు రత్నం ప్రవీణ్, కలువల రవీందర్, కొర్ర రాజు, రజిత, రమ, జ్యోత్స్న, తదితరులు పాల్గొన్నారు.

డీటీఎఫ్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక



సమావేశంలో జిల్లా నూతన కమిటీ బాధ్యులచే ప్రమాణస్వీకారం చేయిస్తున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగారెడ్డి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్(డీటీఎఫ్) నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.లింగారెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సంఘ సమావేశంలో జిల్లా అధ్యక్షుడిగా నెల్లుట్ల భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా టి.దేవేందర్‌రాజు, జిల్లా ఉపాధ్యక్షులుగా ఈసాల లక్ష్మయ్య, ఎం.సునీత, తిరుమలేష్, కార్యదర్శులుగా మాధవ్, శ్రీనివాస్, భీముడు, రాజు, రాష్ట్ర కౌన్సిలర్లుగా బి.శ్రీనివాస్, కె.నిర్మల, కె.కృష్ణమూర్తి, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా ఉపేందర్‌రెడ్డి, సభ్యులుగా విజయ్‌కుమార్, రమేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా లింగారెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్ సమస్యను పరిష్కరించి ఖాళీగా ఉన్న ఎంఈవో, డైట్ లెక్చరర్స్ పదోన్నతులు చేపట్టాలన్నారు. ప్రతీ వేసవిలో ఉపాధ్యాయులు బదిలీలు, పదోన్నతులు చేపట్టాలన్నారు. కేజీబీవీ ఉపాధ్యాయులకు, ఎస్ఎస్ఏ ఉద్యోగులకు మినిమం టైంస్కేల్ వర్తింపచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి నాలుగు సంవత్సరాల నివేదికను ప్రవేశపెట్టారు. ఈసమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాబు దొర, వివిధ మండలాల బాధ్యులు పాల్గొన్నారు.

వంటలు బాగాలేవని విద్యార్థుల ఆందోళన

మరిపెడ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : వంటలు బాగా లేవని మరిపెడ ట్రైబల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు వంటలతో కూడిన ఫొటోలను ఆదివారం సోషల్ మీడియాలో వైరల్ చేశారు. ప్రిన్సిపాల్, వార్డెన్ నిర్లక్ష్యంతో నిత్యం పౌష్టికాహార భోజనం తినలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేసే ఫొటోలు వైరల్ అయ్యాయి. ఉన్నతాధికారులు తక్షణం స్పందించి విద్యార్థులకు మెరుగైన భోజనం అందే విధంగా చర్యలు తీసుకోవాలని వారు సామాజిక మాధ్యమాల ద్వారా అధికారులను డిమాండ్ చేశారు.

8న ప్రజాధర్నాను విజయవంతం చేయాలి



ములుగులో ప్రజాధర్నా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న న్యూడెమోక్రసీ నాయకులు

ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద ఈనెల 8న జరిగే ప్రజాధర్నాను విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ములుగు జిల్లా కేంద్రంలోని జాతీయ రహదారిపై జిల్లా నాయకులు గంగుల దయాకర్, ఎలకంటి రాజేందర్, రాచర్ల బాలరాజు ప్రజాధర్నా వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఆపరేషన్ కగార్ పేరిట దండకారణ్యంలో ఆదివాసీ ప్రజలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న హత్యాకాండను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ ప్రజలు జల్, జంగిల్, జమీన్, ఇజ్జత్ అమారా హై అంటూ అడవిని, అడవిలోని సహజ సంపద, ఖనిజ సంపద, వనరులను కాపాడుకునేందుకు పోరాడుతున్న ఆదివాసీ సంఘాలను నిషేధించి ఆ సంఘం నాయకులపై అక్రమ కేసులు బనాయించి జైలులో పెడుతున్నారని ఆరోపించారు. ఆదివాసీ గిరిజన ప్రజల హక్కుల రక్షణ కోసం రాజ్యాంగంలోని ఐదు, ఆరు షెడ్యూల్లో ఉన్న చట్టాలను మోదీ, అమిత్‌షాల ప్రభుత్వం కాలరాస్తూ రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తుందని విమర్శించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఆదివాసీలపై పెద్దఎత్తున అణచివేత, నిర్బంధం, జాతి హననాన్ని కొనసాగిస్తున్నదని, ఇది సామ్రాజ్యవాద బహుళజాతి సంస్థలకు, దళారీ నిరంకుశ కార్పొరేట్ సంస్థలకు అటవీ సంపదను కట్టబెట్టేందుకేనని అన్నారు. గత ఏడాది జనవరి నెల ప్రారంభం నుంచి నేటి వరకు 400పైగా మంది ఆదివాసీలు, మావోయిస్టు పార్టీ నాయకులు, కార్యకర్తలను ఎన్‌కౌంటర్‌ల పేరుతో పొట్టన పెట్టుకుందని అన్నారు. ఆదివాసీ ప్రజలపై జరుగుతున్న నరమేధాన్ని ఆపివేయాలని, కగార్‌కు వ్యతిరేకంగా తెలంగాణ శాసనసభలో తీర్మానం చేయాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో నాయకులు బొమ్మడ సాంబయ్య, మామిడి నర్సింహారావు, బండి కుమార్, ముంజాల భిక్షపతి గౌడ్, బంక లచ్చన్న, శ్యామల రమేష్, చిరంజీవి, నర్సింగం, కుర్రి ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇక్కడ 12 గంటల పనివేళలు

- తపాలా శాఖ వరంగల్ ప్రధాన కార్యాలయంలో సేవలు
- కేంద్రంలో ఆధార్ అప్‌డేట్, పోస్టల్ బ్యాంకింగ్, జీవితబీమా
- అందుబాటు చార్జీలతో విదేశాలకు పార్సిళ్లు

గిర్మాజిపేట, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ హెడ్‌పోస్టాఫీసులో ఉత్తరాలు, పార్సిళ్లు, బ్యాంకింగ్, జీవితాబీమా సేవలతో పాటు ఆధార్ కార్డు అప్‌డేట్ చేసుకోవచ్చు. విదేశాల్లో ఉన్నవారికి సైతం అవసరమైన మందులు, వస్తువులు అందుబాటు ధరలతో పార్సిళ్లు పంపవచ్చు. శిశువులకు బాల ఆధార్ ఇంటివద్దనే పోస్ట్‌మ్యాన్ ద్వారా ఉచితంగా పొందవచ్చు. రాష్ట్రంలోని అన్ని పోస్టాఫీసులు రోజుకు 8 గంటలు పనిచేస్తుంటే వరంగల్ హెడ్‌పోస్టాఫీసు 12 గంటలు పనిచేస్తూ ప్రజలకు మరింత విస్తృతంగా సేవలందిస్తోంది.

హెడ్ పోస్టాఫీసులో తపాలా సేవలివే..

రెవెన్యూ, పోస్టల్ స్టాంపుల విక్రయం, దేశ, విదేశాలకు ఉత్తరాలు, పార్సిళ్లు, ఇండియన్ పోస్టల్ బ్యాంకింగ్, తపాలా సేవింగ్స్, చిన్నమొత్తాల పొదుపు, తపాలా బీమా పథకాలు, ఇన్సురెన్స్ సేవలు అందిస్తున్నారు.

ఆధార్ సేవా కేంద్రం

వరంగల్ హెడ్‌పోస్టాఫీసులో ప్రత్యేకంగా ఆధార్ సేవా కేంద్రం పనిచేస్తున్నది. ఇందులో కొత్తగా ఆధార్ నమోదును ఉచితంగా చేస్తారు. ఆధార్ కార్డులో పేర్లు, ఇంటి పేర్లు, చిరునామా, పుట్టినతేదీ, ఫొటో, వేలిముద్రలు తదితర సవరింపులను ఆధార్ సంస్థ నిర్ణయించిన ఫీజులతో చేస్తున్నారు. పుట్టిన తేది సవరణకు విద్యాసంస్థ, మున్సిపల్ బర్త్ సర్టిఫికెట్, పాస్‌పోర్టుల్లో ఏదైనా ఒకటి సమర్పించి అప్‌డేట్ చేసుకోవచ్చు. చిరునామా మార్పు కోసం వంట గ్యాసు/ విద్యుత్ బిల్లును సమర్పించాలి. అలాగే బయోమెట్రిక్ సవరణల కోసం ఫొటో, వేలిముద్ర లు, కనుపాపలు అప్‌డేట్ చేసుకునేందుకు 5 సంవత్సరాల నుంచి 15 సంవత్సరాల లోపు ఉచితంగా చేస్తారు. అలాగే 15 సంవత్సరాలు దాటిన వారికి రూ. 100 చార్జి చెల్లించాల్సి ఉంటుంది. అలాగే ఆధార్ డౌన్‌లోడ్ చేసి కలర్ ప్రింట్ కోసం రూ.30 చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుతం 10 సంవత్సరాలకు ఒకసారి ఆధార్‌కార్డును తప్పనిసరిగా అప్‌డేట్ చేసుకోవాలని ఆధార్ సంస్థ ప్రకటించడంతో ఆధార్ సెంటర్లలో రద్దీ పెరుగుతుంది. మీసేవ సెంటర్లలో ఆధార్ సేవల చార్జీలను రూ.100 నుంచి రూ.200 వసూలు చేస్తున్నారు. హెడ్‌పోస్టాఫీసులో ఆధార్ ఎన్‌రోల్ మెంట్, ఆధార్ అప్‌డేట్ రూ.50 నుంచి రూ.100 లోపు తీసుకుంటు న్నారు. ఆధార్ ఎన్‌రోల్, అప్‌డేట్ దేశాయిపేట పోస్టాఫీసులోను అందుబాటులో ఉంది. ఇంటి వద్దనే పోస్ట్‌మ్యాన్‌ల ద్వారానే 0 నుంచి 5 సంవత్సరాలలోపు శిశువులకు ఉచితంగా ఆధార్ తీసుకోవచ్చు.



వరంగల్ ప్రధాన తపాలా కార్యాలయం

ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు ఓపెన్

వరంగల్ హెడ్‌పోస్టాఫీసు పనివేళలు గతంలో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఉండేది. ప్రజల ఇబ్బందులను గ్రహించిన తపాలా శాఖ తెలంగాణ ఉన్నతాధికారులు గత సంవత్సరం నుంచి వరంగల్ హెడ్‌పోస్టాఫీసు పనివేళలను 12 గంటలు పనిచేసేలా నిర్ణయం తీసుకున్నారు. దీంతో ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు వరంగల్ హెడ్‌పోస్టాఫీసు పనిచేస్తోంది. ప్రజలు రాత్రి వేళల్లోను పోస్టాఫీసు సేవలు పొందుతున్నారు.

విదేశీ పార్సిళ్ల ద్వారా ఆదాయం

విదేశాల్లో ఉంటున్నవారికి అవసరమైన వస్తువులు, మందులు, పిండివంటలు తదితర పార్సిళ్లను వరంగల్ హెడ్‌పోస్టాఫీసు ద్వారా పంపే సదుపాయం ఉంది. ప్రైవేట్ కొరియర్ సర్వీసుల కంటే తక్కువ చార్జీలుండటంతో ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. ప్రతి అర కిలోకు అమెరికాకు రూ.1550, కెనడాకు రూ.1180, ఆస్ట్రేలియాకు రూ.975, యూకేకు రు.1570 చార్జి ఉంటుంది. గత సంవత్సరంలో ఈ కౌంటర్ ద్వారా 11 వేల పార్సిళ్లు పంపిస్తున్నారు. దీని ద్వారా తపాలా శాఖకు రూ. 53 లక్షల ఆదాయం వచ్చిందని తపాలాశాఖ అధికారులు తెలిపారు.

తపాలా బీమా పథకాలు

సామాన్య, మధ్య తరగతి వర్గాలకు అందుబాటులో వివిధ జీవిత, ప్రమాద బీమా పథకాలను తపాలాశాఖ అమలు చేస్తోంది. టాటా ఏఐజీ, నీవాబూపాల్, ఆదిత్య బిర్లా/ స్టార్/ బజాజ్ ఇన్సురెన్స్ కంపెనీల సహకారంతో రూ. 10 లక్షలు, రూ.5 లక్షల యాక్సిడెంటల్ బీమా పాలసీని అమలు చేస్తోంది. 18 నుంచి 65 సంవత్సరాలలోపు వయస్సు కలిగిన వారు సంవత్సరానికి రూ.520, రూ.555రూ. 549రూ. 559రూ. 699లు చెల్లిస్తే రూ.10 లక్షల యాక్సిడెంటల్ బీమా పొందవచ్చు. అలాగే నీవాబూపాల్ రూ.755, ఆదిత్య బిర్లా రూ.749, స్టార్ ఇన్సురెన్స్‌కు రూ.799లు చెల్లించి రూ.15 లక్షల ప్రమాద బీమా సదుపాయం పొందవచ్చు. అలాగే రూ.320లు చెల్లిస్తే రూ.5 లక్షల యాక్సిడెంటల్ బీమా వర్తిస్తుందని తపాలా అధికారులు తెలిపారు. తపాలా ప్రమాద బీమా పథకాలు పేద, రోజువారి కూలీ పనులు చేసుకుంటున్న కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. ప్రమాదవశాత్తు పాలసీదారుడు మృతి చెందితే ఆ కుటుంబానికి తపాలా బీమాలు ఆర్థికంగా రక్షణ కల్పిస్తున్నాయి. అలాగే ఇండియన్ పోస్టల్ బ్యాంకింగ్ ద్వారా సేవింగ్ అకౌంట్లు, డిపాజిట్ పథకాలతో పాటు పిల్లలకు సుకన్య సమృద్ధి యోజన, సీనియర్ సిటిజన్లు, మహిళల కోసం ప్రత్యేక డిపాజిట్, సేవింగ్స్, నెలవారీ ఆదాయం స్కీమ్‌లను తపాలాశాఖ అమలు చేస్తుంది. ఇందుకు సంబంధించిన అన్ని కార్యకలాపాలు హెడ్ పోస్టాఫీసులో ఉన్నాయి.

తపాలా బీమా చేయించుకోండి

బి.రవికుమార్, తపాలా శాఖ వరంగల్ సూపరింటెండెంట్



అన్ని వర్గాల ప్రజలకు తపాలాబీమా పథకాలు చాలా మేలు చేస్తున్నాయి. ఏదైనా ప్రమాదంలో కుటుంబ యజమాని మృతి చెందితే ఆ కుటుంబం రోడ్డున పడకుండా కాపాడేందుకు తపాలా బీమా పథకం చాలా ఉపయోగపడుతుంది. పేదలు, రోజువారి కూలీలు, ఆర్థిక చేయూతలేని వారు తప్పకుండా తమ ఆర్థిక స్థితిగతులకు అనుగుణంగా తపాలా బీమా తీసుకోవాలి. తద్వారా వారి కుటుంబానికి మేలు జరుగుతుంది. ప్రతి ఒక్కరూ తపాలా బీమా చేయించుకుంటే బాగుంటుంది. తపాలా బీమా పథకాలను అన్ని వర్గాలు ఉపయోగించుకోవచ్చు. అలాగే అందుబాటు చార్జీలతో విదేశాల పార్సిళ్లు పంపించుకోవచ్చు. ఆధార్ సేవలనూ ప్రజలు వినియోగించుకోవాలి.



తలంబ్రాల వేడుక

కల్యాణం.. కమనీయం..

భద్రాద్రిలో వైభవంగా సీతారాముల పరిణయం

దక్షిణ అయోధ్యగా భాసిల్లుతున్న భద్రాచలంలో సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. ఈ వేడుకకు సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించగా పలువురు ప్రముఖులు హాజరయ్యారు.

భక్తి పారవశ్యంలో సినీ నటి కొణిదెల నిహారిక



ముత్యాల తలంబ్రాలు తీసుకొస్తున్న దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ





కల్యాణ వేడుకలో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు, డిప్యూటీ సీఎం భట్టి దంపతులు



టీటీడీ తరపున పట్టువస్త్రాలు సమర్పిస్తున్న చైర్మన్ బీఆర్ నాయుడు



కల్యాణం అనంతరం తిరువీధి సేవకు బయలుదేరిన సీతారాములు



రామాలయంలో అర్చక బృందంతో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు

పోషణ్ ట్రాకర్ కష్టాలు

- ఏడేళ్ల కిందటి 2జీబీ ర్యామ్ ఫోన్లే దిక్కు
- అంగన్‌వాడీ టీచర్ల సహనానికి పరీక్ష
- కేంద్రం లబ్ధిదారుల వివరాల నమోదులో జాప్యం

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కేంద్రాల లబ్ధిదారుల వివరాల నమోదు గగనంగా మారింది. ఏడేళ్ల క్రితం ప్రభుత్వం అందజేసిన 2 జీబీ ర్యామ్ ఫోన్లలోనే లబ్ధిదారులు, పౌష్టికాహార వివరాల నమోదు సమస్యలకు ప్రధాన కారణమైంది.

పోషణ్ ట్రాకర్ యాప్‌లో నమోదు కష్టాలు

అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా అయ్యే సరుకుల దుర్వినియోగాన్ని అరికట్టడం, లబ్ధిదారులకు పౌష్టికాహారం పకడ్బందీగా అందజేయాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా 'పోషణ్ ట్రాకర్' పేరుతో యాప్‌ను ప్రవేశపెట్టింది. ఇందులో కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, 0-3 ఏళ్లు, 3-6 ఏళ్ల ప్రీస్కూల్ పిల్లలకు ఇచ్చే పౌష్టికాహార సరుకుల వివరాల నమోదు చేయాలి. అంతేకాకుండా వారి పేర్లు, ఆధార్‌కార్డు తదితర వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. పాత ఫోన్లలో పోషణ్ ట్రాకర్ వివరాల సేకరణ సాంకేతిక సమస్యలను సృష్టిస్తోంది. వివరాల నమోదు వేగంగా జరిగేందుకు ఈ ఫోన్లు సాంకేతికంగా అనువుగా లేవు. ఫోన్ల నెట్‌వర్క్ సరిగా ఉండే నగర ప్రదేశాల్లోనే వివరాల నమోదు కష్టంగా ఉంటే ఇక మారుమూల, ఏజెన్సీ ప్రాంతాల్లోని కేంద్రాలకు అసలు నెట్‌వర్క్ ఉండడం లేదు. దీంతో ఈ ప్రాంత అంగన్‌వాడీ టీచర్లు మరింత సమస్యను ఎదుర్కొంటున్నారు.

ఉమ్మడి జిల్లాలో 4 వేలకు పైగా కేంద్రాలు

వరంగల్ ఉమ్మడి జిల్లాలో 4 వేలకు పైగా అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. అన్ని కేంద్రాల్లో ఈ సమస్య ఉండడంతో టీచర్లు తలపట్టుకుంటున్నారు. ఒకటి, రెండు కాదు అనేక సాంకేతిక అంశాలూ టీచర్లను వేధిస్తున్నాయి. ఎవరైనా ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి నివాసం మారినప్పుడు మారిన చోటు కేంద్రంలో లబ్ధిదారుల వివరాల నమోదు ప్రహసనంగా మారింది. తొలుత నమోదైన సెంటర్‌లో పూర్తిగా వివరాల తొలగింపు జరిగితేనే కొత్త సెంటర్‌లో మళ్లీ వివరాల నమోదు జరుగుతుంది. అయితే ఈ ప్రక్రియకు 2 జీబీ ర్యామ్ ఫోన్లు అవరోధంగా మారాయి. ఒకవైపు యాప్ సులభంగా లేకపోవడం, మరోవైపు ఫోన్ల సాంకేతికత అనువుగా లేకపోవడం వంటి అనేక సమస్యలు నమోదును క్లిష్టతరం చేస్తున్నాయి. పోషణ్ ట్రాకర్ యాప్‌తో అంగన్వాడీ టీచర్లు అసహనానికి గురవుతున్నారు.

తనిఖీల్లో నమ్మని అధికారులు.. అభద్రతలో టీచర్లు

పోషణ్ ట్రాకర్ యాప్‌లో లబ్ధిదారులు, సరుకుల అందజేత వివరాలు ఎప్పటికప్పుడు టీచర్లు ఆన్‌లైన్ చేయాలి. అయితే 2జీబీ ఫోన్లు సతాయిస్తుండడంతో సమయానికి వివరాలు నమోదు కావడం లేదు. ఈ క్రమంలో ఉన్నతాధికారులు కేంద్రాలకు తనిఖీకి వచ్చిన సమయంలో లబ్ధిదారులు, సరుకుల సరఫరాల వివరాల్లో తేడా ఉంటున్నాయి. ఇదంతా టీచర్ల మెడకు బిగుసుకుంటుంది. ఏడేళ్ల కిందటి ఫోన్లు అవుట్ డేట్ కావడంతో సమస్యగా మారింది. ఆ ఫోన్ల రిపేరు, పరికరాలు కూడా దొరకడం లేదు.

ఉన్నతాధికారులకు విన్నవించినా ఫలితం శూన్యం

అంగన్‌వాడీ టీచర్లు విషయాన్ని ఉన్నతాధికారులకు వివరించినా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందనే సమాధానంతో దాట వేస్తున్నారు. అయితే కేంద్రాల్లో ఏర్పడే సమస్యలకు మాత్రం టీచర్లనే బాధ్యులను చేస్తున్నారు. ఈ సమస్య పరిష్కరించే దిశలో ప్రభుత్వం ఆలోచన చేయాలని టీచర్లు విజ్ఞప్తి చేస్తున్నారు. ట్యాబ్‌లు అందజేస్తే సమస్యకు పరిష్కారం ఉంటుందని అంగన్‌వాడీ టీచర్లు వేడుకుంటున్నారు.

రాములోరి పెళ్లికి ఊరంతా పందిరి

- నేత్రపర్వంగా జానకీరాముల కల్యాణం
- అపరమిథిలా నగరంగా శోభిల్లిన ఓరుగల్లు
- పూజలకు హాజరైన ప్రజాప్రతినిధులు, ప్రముఖులు

హనుమకొండ కల్చరల్/ వరంగల్ కల్చరల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): అంతా రామమయంగా మారింది. చూచూవారలకు చూడముచ్చటగా.. రాములోరి పెళ్లి వేడుకలు కన్నుల పండుగగా జరిగాయి. హనుమకొండలోని ప్రధాన రెవెన్యూ కాలనీలోని రామాలయంలో ఈసారి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తుల కోలాహలం మధ్య సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు ఆరవెల్లి శ్రీకాంతాచార్య ఆధ్వర్యంలో స్వామివారికి సంప్రదాయంగా కల్యాణోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య పాల్గొని స్వామివారికి ముత్యాల తలంబ్రాలు అందజేశారు. ఆలయ చైర్మన్ బూసూరి సాంబమూర్తి, రామారావు, సెక్రటరీ ప్రసాద్ ఆధ్వర్యంలో భక్తులందరికీ అన్నప్రసాదం నిర్వహించడం విశేషం.

ఆలయాల్లో..

హనుమకొండలోని రాగన్న దర్వాజ శ్రీసీతారామ చంద్రస్వామి ఆలయంగా ప్రసిద్ధి చెందిన చిన్న కోవెలలో 2వేల మంది కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణం, ఆరుబయట రోడ్లపై ప్రత్యేకంగా వేసిన షామియానాల మధ్య కండ్లకుంట వెంకటచారి, చెరకుపల్లి శ్రీనివాసచారిల యాజ్ఞికం మధ్య ఆలయ అనువంశీయ ధర్మకర్త చెరకుపల్లి నర్సింహాచార్య ఆధ్వర్యంలో వైభవంగా వేడుకలు జరిగాయి. డాక్టర్ జ్ఞానేష్, స్థానిక కార్పొరేటర్ వేముల శ్రీనివాస్, రేబల్లి వెంకటేశ్వరస్వామి తదితర కాలనీ ప్రముఖులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కల్యాణంలో పాల్గొన్న భక్తులు మజ్జిగ, అన్న ప్రసాద వితరణ చేశారు. హనుమకొండ అదాలత్ సమీపంలోని శ్రీభూనీలా సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆలయ కమిటీ నిర్వాహకులు అమరేందర్‌రెడ్డి, చాడ సునీత-సుభాష్‌రెడ్డి, అమృతరెడ్డి- జమున, శ్రీధర్‌రెడ్డి-కల్పన, ఇతర కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు నర్సింహా దేశికన్, వంశీ కృష్ణమాచార్య, ఆరవెల్లి వెంకట కృష్ణచైతన్యల ఆధ్వర్యంలో వైభవంగా వేడుకలు నిర్వహించారు. సాయంత్రం నాగవెల్లిని కూడా సంప్రదాయంగా నిర్వహించారు. హనుమకొండ విద్యానగర్ విజయగణపతి ఆలయంలో ఆ ప్రాంతానికి చెందిన ఇరిగేషన్ సీఈ వెంకటకృష్ణ-మాధవిల ఇంటి నుంచి శ్రీరాముడు, వీరారెడ్డి స్వగృహం నుంచి సీతమ్మ వారిని ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. నేత్రపర్వంగా నిర్వహించిన కల్యాణంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. వనం లక్ష్మీకాంతారావు, డాక్టర్ ఎన్‌వీఎన్.చారి తదితర అనేక మంది ప్రముఖులు కల్యాణోత్సవంలో పాల్గొన్న వారిలో ఉన్నారు. హనుమకొండ గుడిబండర్‌లోని శ్రీ వెంకటేశ్వర ఆలయంలో వైభవంగా శ్రీరామనవమి వేడుకలు, సీతారాముల కల్యాణం నిర్వహించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త కలకోట శ్రీనివాసాచార్య ఆధ్వర్యంలో కల్యాణోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ పులి విక్రమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. హనుమకొండ లష్కర్ బజార్‌లోని రామమందిర్‌లో నేత్రపర్వంగా శ్రీరామ నవమి, సీతారాముల కల్యాణోత్సవాలు ఘనశ్యామ్ శర్మ ఆధ్వర్యంలో వైభవంగా జరిగాయి. మార్వాడీలు పెద్ద సంఖ్యలో సంప్రదాయ దుస్తులతో వేడుకల్లో పాల్గొని భజనలు నిర్వహించారు. టీటీడీ కల్యాణ మండపంలో హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో టీటీడీ కల్యాణ మండప మేనేజర్ కనపర్తి రఘువీర్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో టీటీడీ ప్రోగ్రాం ఇన్‌చార్జి రామిరెడ్డి కృష్ణమూర్తి దంపతులు పాల్గొన్నారు. హనుమకొండ చౌరస్తాలోని శివశక్తిస్థల్, ములుగురోడ్‌లోని గురుధామంలో శివానంద కల్చరల్ ట్రస్ట్, ఎక్సైజ్ కాలనీ వెంకటేశ్వరాలయంలో, ఏకశిలా పార్కు సమీపంలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో, ములుగురోడ్‌లోని దత్తక్షేత్రంలో ఆలయ ట్రస్టీ వైవి.వామన్‌రావు ఆధ్వర్యంలో నేత్రపర్వంగా సీతారాముల కల్యాణోత్సవాలు వైభవంగా నిర్వహించారు.



వేయిస్తంభాల ఆలయంలో హోమం చేస్తున్న పూజారులు, భక్తులు



కాశిబుగ్గలో కల్యాణ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య

నేడు పట్టాభిషేకం

వరంగల్ రామన్నపేట శ్రీరామ లింగేశ్వరస్వామి దేవాలయం వద్ద గత 40 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం పట్టాభిషేకం నిర్వహిస్తారు. రామాలయాల్లో కూడా ప్రత్యేక వేడుకలు నిర్వహిస్తారు.

వేయిస్తంభాల గుడిలో..

హనుమకొండలోని ప్రసిద్ధ వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో ఆలయ ప్రాంగణంలో శ్రీరామ నవమి సందర్భంగా ప్రత్యేక వేదికపై నేత్రపర్వంగా శ్రీసీతారామ కల్యాణోత్సవం జరిగింది. పాంచరాత్ర ఆగమానుసారం వేద పండితుడు గుడిమల్ల విజయ కుమారాచార్య, మణికంఠ శర్మల వేద మంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో వైభవంగా కల్యాణోత్సవం జరిగింది. పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి స్వామివారికి సంప్రదాయంగా పట్టువస్త్రాలు, తలంబ్రాలను సమర్పించారు. ప్రముఖ న్యాయవాది రవీంద్రనాథ్- వసంత దంపతులు ఉభయ దాతలుగా రామయ్య పక్షాన నిలిచి కల్యాణ తంతులో పాల్గొన్నారు. అంతకుముందు తొమ్మిది రోజులుగా నిర్వహిస్తున్న వసంత నవరాత్రి వేడుకల ముగింపు క్రమంలో మహాసుదర్శన హోమ పూర్ణాహుతి నిర్వహించారు. టీటీడీ భజన బృందం వారు అద్భుతమైన సంకీర్తనలతో వీరికి తోడు కృష్ణవేణి, సాహితీలు ఆలపించిన సంకీర్తనలు భక్తులను ఓలలాండిపజేశాయి. ఆలయ ఈవో అనిల్‌కుమార్ పర్యవేక్షించారు. అనంతరం భక్తులకు మహాప్రసాదం అందజేశారు.

వరంగల్ జిల్లాలో..


వరంగల్ జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామాలతో పాటు వరంగల్ నగరంలో శ్రీ సీతారాముల కల్యాణం వైభవోపేతంగ సాగింది. వరంగల్ శివనగర్‌లోని శ్రీసీతారామ ఆలయం, ఎల్లం బజార్‌లోని శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయం, బట్టల బజార్‌లోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయం, గీతా భవన్‌లో శ్రీకృష్ణ మందిరం, పోతన రోడ్డులోని శ్రీమురళీకృష్ణ మందిరం, ములుగు రోడ్డులోని శ్రీగణపతి సచ్చిదానంద వరద దత్తక్షేత్రం, గురుధామం, కాశిబుగ్గలోని కాశీ విశ్వేశ్వరాలయంలో, ఆకారపువారి దేవాలయం, ఓసిటీ, కొత్తవాడ, రాంకీ, పోచమ్మ మైదాన్, కరీమాబాద్, ఉర్సు, ఎస్ఆర్ఆర్ తోట, గిర్మాజీపేట, పిన్నవారివీధి, రామన్నపేట, మట్టెవాడ తదితర ప్రాంతాలతో పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో కల్యాణోత్సవాలు వైభవంగా నిర్వహించారు. మండపాలను అందంగా తీర్చిదిద్ది జై శ్రీరామ్ నామంతో కూడిన కాషాయ జెండాలతో అందంగా అలంకరించారు. భద్రకాళి ఆర్చి, ఎంజీఎం సెంటర్ నుంచి మండపాల వద్దకు శ్రీసీతారాముల విగ్రహాలను డప్పు చప్పుళ్లతో ఊరేగింపుగా తీసుకెళ్లారు. మండపాల వద్ద వడపప్పు, బెల్లం పానకం, మామిడి కాయ పులిహోర ప్రసాదంగా అందించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పోచమ్మ మైదాన్‌లో జరిగిన కల్యాణ వేడుకలో మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య పాల్గొనగా, కాశిబుగ్గలో మేయర్ దంపతులు గుండు సుధారాణి- ప్రభాకర్ పాల్గొన్నారు. కాలనీల్లో కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు కల్యాణోత్సవాల్లో పాల్గొన్నారు. రామన్నపేటలో శ్రీసీతారామ కల్యాణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు దాదాపు 3 వేల మంది భక్తులు హాజరయ్యారు. సాయంత్రం శ్రీసీతారాముల విగ్రహాలను తిరిగి ఆలయాల్లో భద్రపర్చడానికి బ్యాండ్ మేళాలతో మంగళహారతులతో ఊరేగింపు నిర్వహించారు.



పోస్టల్ అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళ హారతులతో మహిళలు



భూనీలా సమేత వేంకటేశ్వర ఆలయంలో సీతా రాములు ←





నాపాక ఆలయంలో నృత్యకారిణులతో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



కాళేశ్వరంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో పాల్గొన్న భక్తులు



రావులపల్లి పట్టాభిసీతారామచంద్ర స్వామి ఆలయంలో కల్యాణ వేడుకలు





వాజేడులో కల్యాణ తంతు దృశ్యం , జంగాలపల్లిలో పూజలు చేస్తున్న డీఎస్పీ





మహాముత్తారంలో , మొగుళ్లపల్లిలో తాళిబొట్టు చూపుతున్న అర్చకులు

కమనీయం ..రాములోరి కల్యాణం..

భూపాలపల్లిటౌన్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): సీతారాముల దీవెనలతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. భూపాలపల్లి పట్టణంలోని సుభాష్‌కాలనీలో గల శ్రీసీతారా మాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం శ్రీసీతారాముల కళ్యాణమ హోత్సవం వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కళ్యాణ మహోత్సవంలో సింగరేణి జీఎం రాజేశ్వర్‌రెడ్డి దంపతులు, డీఎస్పీ సంపత్‌రావు దంపతులు, కాంగ్రెస్ నాయకులు చల్లూరి మధు, బుర్ర కొంరయ్య, అంబాల శ్రీనివాస్, దాట్ల శ్రీనివాస్, ఆలయ చైర్మన్ మచ్చ భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

● చిట్యాల : మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల ప్రజలు శ్రీరామనవమి వేడుకల సందర్భంగా సీతారాముల కల్యాణం ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. చిట్యాల, చల్లగరిగ, జడల్‌పేట, నైన్‌పాక, గిద్దెముత్తారం గ్రామాల్లో అన్నదానం కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మధువంశీ కృష్ణ, మండల అధ్యక్షుడు తిరుపతి, నక్క భాస్కర్, రాయకొమురు, అనిల్, మహేష్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

● కాటారం : మండలంలోని ధన్వాడ దత్తాత్రేయస్వామి, రేగులగూడెం, గారెపల్లి భక్తాంజనేయస్వామి, కాటారం అభయాంజనే యస్వామి, బొప్పారం సీతారామాంజనేయస్వామి, చింతకాని చెన్నకేశవ స్వామి, గూడూరు, గంగారం ఆంజనేయస్వామి ఆలయాల ఆవరణలో సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు.. ఆయా ఆలయాల్లో వేదపండితులు కృష్ణమోహన్, లక్ష్మీకాంత్, ప్రవీణ్, గణేష్, ఆశీష్, నాగరాజు, నిఖిల్‌చారి, రామాచార్యులు, కిష్టయ్య, సురేష్, రామ్మూర్తి వందలాదిమంది భక్తుల సమక్షంలో కళ్యాణ ఘట్టాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో పలువురు రాజకీయ పార్టీల నాయకులు, ఆలయ ధర్మకర్తలు, ఆలయ కమిటీల ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

● మహదేవపూర్ : శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానం అనుబంధ దేవాలయమైన శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో ఆదివారం ఆరుట్ల రామాచార్యులు, రామాలయం అర్చకులు, ప్రధాన అర్చకులు , వేద పండితులు శ్రీ సీతారాముల కళ్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. కార్యనిర్వహణాధికారి ఎస్.మహేష్, సూపరిం టెండెంట్ బుర్రి శ్రీనివాస్, సిబ్బంది, కాళేశ్వరం గ్రామస్తులు, భక్తులు, దాతలు, హనుమాన్ దీక్షాస్వాములు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. స్వామివార్ల కళ్యాణం వీక్షించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కళ్యాణం అనంతరం స్వామివారి కలశం లేతకారి రాజబాపు 7116 చెల్లించి పాట పాడి కొబ్బరి కాయ, కలశాన్ని దక్కించుకున్నారు.

● మొగుళ్లపల్లి : మండలంలోని మొగుళ్లపల్లి, రంగాపురం, పోతుగల్లు, మొట్లపల్లి గ్రామాల్లోని ఆలయాల్లో సీతారాముల కల్యాణ మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. అనంతరం ఆలయల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో అర్చకులు శ్రీధరాచార్యులు, రామాంజనేయచార్యులు, వెంకటేశ్వరు శర్మ, ప్రజలు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

● మల్హర్ : మండల కేంద్రమైన తాడిచర్ల, పెద్దతూండ్ల, ఎడ్లపల్లి గ్రామాల్లో ఆదివారం శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తాడిచర్లలో నిర్వహించిన సీతరాముల కల్యాణానికి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. అర్చకులు ప్రహ్లాద్ శర్మ, శ్యామ్ సుందర్ శర్మ, మనోజ్ శర్మలు కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు.

● మహాముత్తారం : మండలంలోని మహాముత్తారం, మీనాజీపేట, నర్సింగాపూర్, వజినేపల్లి, బోర్లగూడెం, సింగారం గ్రామాలలో శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని ఆదివారం వేదపండితులు కన్నుల పండుగా నిర్వహించారు. ఆయా గ్రామాలలోని ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

● రేగొండ : మండలంలోని రావులపల్లి గ్రామంలోని పట్టాభిరామ చంద్రస్వామి, రూపిరెడ్డిపల్లిలోని సీతారామాంజనేయ స్వామి ఆలయాలలో జరిగిన కల్యాణ వేడుకలను ఎమ్మెల్యే గండ్ర సత్యనారా యణరావులు హాజరై తిలకించారు. ఎమ్మెల్యేకు ఆలయ చైర్మన్‌లు ముద్దనపల్లి శంకరయ్య, మేకల భిక్షపతిలు ఆలయమర్యాదలతో స్వాగతం పలికారు. మేకల సునీతశంకర్‌లు రావులపల్లి కల్యాణానికి పట్టు వస్త్రాలు సమర్పించారు. రావుల వనజఅశోక్ దంపతులు రూపిరెడ్డిపల్లిలో జరిగిన కళ్యాణానికి రూ1,11116లు అందజేశారు. గూడెపల్లి గ్రామంలో కళ్యాణ వేడు కలకు సాంబారి సమ్మారావు హాజరయ్యారు.

● ఏటూరునాగారం : మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి రామాలయంలో సీతారాముల కళ్యాణం అంగరం వైభవంగా కన్నుల పండువగా నిర్వహించారు.వేద పండితులు ఎల్లాప్రగడ మణి కంఠశర్మ, ప్రసన్న, నాగేశ్వరరావుశర్మ, ముక్కాముల వెంకటనా రాయణ శర్మ, రాధాకృష్ణ శర్మ కళ్యాణం వైభవంగా జరిపించారు. కల్యాణానికి మంత్రి సీతక్క ఓఎస్‌డీ నూతి మధుసూదన్, ఏటూరు నాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ దంపతులు, ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహరావు దంపతులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని రామన్నగూడెం, రాంనగర్, రొయ్యూరు, శంకరాజుపల్లి తదితర గ్రామాలల్లో కమిటీ సభ్యులు స్వామివారి కల్యాణాన్ని జరిపించారు. రామాలయం కమిటీ చైర్మన్ అలువాల శ్రీనివాస్, కమిటీ సభ్యులు, సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై తాజుద్దీన్, ఆలయ గౌరవ సభ్యులు ఇర్సవడ్ల వెంకన్న, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

● గోవిందరావుపేట : మండలంలోని గోవిందరావుపేట, చల్వాయి, పస్రా, దుంపెల్లిగూడెం, మచ్చాపూర్ గ్రామాల్లోని దేవాలయాల్లో ఆదివారం సీతారాముల కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఈవేడుకల్లో కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ పాల్గొని సీతారాముల కల్యాణాన్ని వీక్షించి స్వామివారి ఆశీర్వచనాలు తీసుకున్నారు. జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

● కన్నాయిగూడెం : మండల కేంద్రం తో పాటుగా గుర్రేవుల , ముప్పనపల్లి , బుట్టాయిగూడెం ,సింగారం , ఏటూరు తదితర గ్రామాల్లో సీతారాముల కళ్యాణాన్ని భక్తులు , గ్రామస్థులు అంగరంగ వైబవంగా జరుపుకున్నారు. గుడుల వద్ద భక్తులకు ఎండ దెబ్బ తగలకుండా చలువ పందిళ్ల , మంచి నీళ్ల వసతి ఏర్పాటు చేశారు. గుర్రేవుల జరిగిన రాములోరి కళ్యాణానికి గ్రామస్థులతో పాటుగా ఎస్సై వెంకటేష్ , వివిద ప్రముఖులు తదితరులు హజరయ్యారు.

● తాడ్వాయి : మండల వ్యాప్తంగా శ్రీరామనవమి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. గ్రామాల్లోని రామాలయల్లో సీతారాముల కళ్యాణం దేవస్థాన కమిటీల ఆధ్వర్యంలో జరిగాయి. యువకులు, గ్రామ పెద్దలు కమిటీ సభ్యులతో కలిసి వేద పండితుల మంత్రోచ్చరణలతో డోలిలు, సన్నాయి మేళాల నడుమ కల్యాణ మహోత్సవ వేడుకలు జరుపుకున్నారు. అన్నదాన కార్యక్రమాలు చేపట్టి గ్రామస్తులందరు కలిసి విందు బోజనాలు చేశారు.

● వాజేడు : మండలంలో సీతారామచంద్రస్వామి కల్యాణ మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. మండలకేంద్రంలోని రామాలయంతోపాటు ధర్మవరం, పేరూరు, చంద్రుపట్ల, జగన్నాథపురం, చీకుపల్లి, కొంగాల, తదితర గ్రామాల్లో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని అర్చకులు ఘనంగా జరిపించారు. కల్యాణ వేడుకలకు స్థానిక భక్తజనం తరలివచ్చి తిలకించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు.

●వెంకటాపురం(నూగూరు): మండలకేంద్రంలోని రెవెన్యూ క్వార్టర్స్ కల్యాణ మండపంలో శ్రీరామ నవమి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా వేదపండితులు మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. కాగా, మండలకేంద్రంలోని అప్పాలవారివీధిలో నవమి వేడుకలు ఘనంగా జరిగాయి. అదేవిధంగా మండలంలోని గొల్లగూడెం, పాత్రాపురం, సూరవీడు, ఎదిర, మరికాల, బర్లగూడెం, ఆలుబాక, రామచంద్రాపురం గ్రామాల్లో శ్రీరామ నవమి వేడుకలు వైభవంగా జరిగాయి. అనంతరం ఆలయాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

●వెంకటాపూర్(రామప్ప): వెంకటాపూర్ మండలకేంద్రంలోని సీతారామాంజనేయస్వామి దేవాలయంలో ఆదివారం శ్రీరామ నవమి వేడుకలు వైభవంగా జరిగాయి. ఆలయ కమిటీ చైర్మన్ నరెడ్ల భాస్కర్, పోశాల వీరమల్లు, ల్యాగల సాంబయ్య దంపతులు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. పురోహితులు ముడుంబ రఘునాథ చార్యులు కల్యాణ పూజలు ప్రారంభించారు. ముత్యాల తలంబ్రాల వేడుకలు ఎస్సై జక్కుల సతీష్ దంపతులు నిర్వహించారు.

● మంగపేట : మండలంలోని కమలాపురంలోని శ్రీసీతారామా దేవస్థానం, పాతూరు కాలనీలో భక్తాంజనేయాస్వామి, గ్రామ శివారులో గల ప్రసన్నంజనేయాస్వామి, బోరునర్సాపురంలోని శ్రీసీతారామాంజనేయాస్వామి, చెరుపల్లి, తిమ్మంపేటలోని రామాలయాలల్లో మల్లూరులోని రామాలయంలోని నర్సింహసాగార్, వాడగూడెం, పాలాయిగూడెం, రమణక్కపేట, రాజుపేట, రామచంద్రునిపేట, అకినేపల్లి-మల్లారంలోని రామాలయంలో ఆదివారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరిగాయి. కల్యాణ క్రతువులను తిలకించిన భక్తులు పులకించిపోయి మొక్కులు చెల్లించుకున్నారు. ఇదేక్రమంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. కార్యక్రమాలలో ఆలయ కమిటీల సభ్యులు పలువురు ప్రముఖులు, విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు.



కాటారం సీతారామాంజనేయస్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవం, కల్యాణోత్సవంలో పాల్గొన్న అంజన్న మాలధారులు, భక్తులు



మల్లంపల్లి శివారు మహ్మద్‌గౌస్‌పల్లిలో జానకీరాముల కల్యాణాన్ని జరిపిస్తున్న భక్తులు



వెంకటాపూర్‌లో సీతమ్మకు ముత్యాల తలంబ్రాలు సమర్పిస్తున్న ఎస్సై సతీష్ దంపతులు



గోవిందరావుపేటలో రాములోరి కల్యాణంలో పాల్గొన్న భక్తులు



మంగపేటలో కల్యాణోత్సవ దృశ్యం

రథయాత్రను విజయవంతం చేయాలి

ఏటూరునాగారం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీల రాజ్యాధికారం కోసం డాక్టర్ విశారదన్ మహారాజ్ తలపెట్టిన లక్ష కిలోమీటర్ల మా భూమి రథయాత్రను విజయవంతం చేయాలని ధర్మ సమాజ్ పార్టీ ములుగు జిల్లా కన్వీనర్ తరుణ్ మహారాజ్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ధర్మ సమాజ్ పార్టీ(డీఎస్పీ) ఆధ్వర్యంలో ఆదివారం ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. మండల అధ్యక్షుడు రాజశేఖర్ మహారాజ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా ములుగు జిల్లా కన్వీనర్ తరుణ్ మహారాజ్, జిల్లా నాయకులు నెగరకంటి సురేష్ మహారాజ్ హాజరయ్యారు. కార్యక్రమంలో డీఎస్పీ జిల్లా నాయకులు శరన్ మహారాజ్, గణపతి మహారాజ్, మండల అధ్యక్షుడు జగన్ మహారాజ్, చిరంజీవి, వెంకటేష్ యాదవ్, సాయి కుమార్, కిషోర్, ఆనంద్, అజయ్, డీఎస్‌యూ నాయకులు విజయ్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ ఎన్నిక

మహాముత్తారం, ఏప్రిల్6(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోర్లగూడెం శ్రీబాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయ కమిటి చైర్మన్‌గా అజ్మీరా పూల్‌సింగ్ నాయక్ ఎన్నికయ్యారు. ఆదివారం ఆలయ పూర్తి కమిటిని ఎన్నుకొన్నారు. ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులుగా పూజారి హట్కర్ శ్రీరామ్‌నాయక్‌ను ఎన్నుకొన్నారు. ఉపాధ్యక్షులు భానోత్ రాజునాయక్‌ను, కార్యదర్శిగా ధరమ్‌సింగ్‌ను, కోశాధికారిగా హట్కర్ రవిని ఎన్నుకొన్నారు.

ప్రమాద బాధితుడికి ఆర్థికసాయం

మొగుళ్లపల్లి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని పెద్దవాగు బ్రిడ్జిపై గతనెల 25న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆరేళ్ల మణిదీప్ కుటుంబానికి ఆదివారం ఆర్థికసాయం అందజేశారు. మణిదీప్ తలకు తీవ్ర గాయాలు కావడంతో హైదరాబాద్‌లోని రేయిన్‌బో చిల్డ్రన్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మణిదీప్ తల్లి మౌనిక స్నేహితులు మానవత్వంతో ముందుకు వచ్చి తమవంతుగా వైద్యఖర్చుల నిమిత్తం రూ.45వేల ఆర్థికసాయం అందజేశారు. స్నేహితులు తిప్పారపు సురేందర్, కిరణ్, రోజా, రాజు, శ్రీనివాస్, ప్రశాంత్, లలిత పాల్గొన్నారు.

నేడు, రేపు ఉచిత వైద్య శిబిరాలు

కాటారం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి):శాసనసభ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు వర్ధంతి సందర్భంగా కాటారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఈ నెల 7, 8 వ తేదీల్లో పుష్పగిరి కంటి ఆస్పత్రి, శ్రీపాద మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంటిచికిత్స వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

రేషన్ షాపుల్లో సన్న బియ్యం పంపిణీ

మహాముత్తారం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని యామన్ పల్లి, నిమ్మగూడెం గ్రామా లలో ఆదివారం రేషన్ షాపుల్లో సన్న బియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ మెనిఫె స్టో కమిటీ చైర్మన్‌గా ఉన్న మంత్రి శ్రీధర్‌బాబు ఆరు గ్యారంటీలలో ఇచ్చిన హామి మేరకు ఇప్పుడు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నజీర్‌ఖాన్, అట్టెం రమేష్, కిష్టయ్య, ధన్‌సింగ్, వినయ్, ఆజయ్ తదితరులు పాల్గొన్నారు.



రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్న దృశ్యం

గ్రామగ్రామాన బీజేపీ ఆవిర్భావ వేడుకలు



వెంకటాపురంలో జెండా ఎగురవేస్తున్న బీజేపీ నాయకులు



మంగపేట వేడుకల్లో పాల్గొన్న బీజేపీ నాయకులు



చిట్యాలలో జెండా ఎగురవేస్తున్న బీజేపీ నాయకులు

మహాముత్తారం, ఏప్రిల్6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బీజేపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ జెండాను ఎగుర వేశారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు పూర్ణచందర్ మాట్లాడుతూ దేశంలో అన్ని మతాలు, కులాల ఉన్నతి కోసం పాడుపడె పార్టి బీజేపి మాత్రమేనని అన్నారు. బీజేపి పెద్దపల్లి జిల్లా అధికారప్రతినిధి సంపత్, నాయకులు రాజు, నవీన్‌నాయక్, కవిత, ఉదయ్, కిరణ్, సారయ్య పాల్గొన్నారు.

● చిట్యాల : భారతీయ జనతా పార్టి 45వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పార్టీ శ్రేణులు ఆదివారం మండల కేంద్రంలో ఘనంగా జరుపుకున్నారు. మండల పార్టీ అధ్యక్షుడు బుర్ర వెంకటేష్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మాచర్ల రఘు, నాయకులు చెక్క నర్సయ్య, గుండ సురేష్, పెరుమాండ్ల రాజు, నల్ల శ్రీనివాస్, బీజేవైఎం మండల అధ్యక్షుడు షైదం శ్రీకాంత్, అనుప మహేష్, ప్రభాకర్, ప్రవీణ్, రాకేష్ పాల్గొన్నారు.

● కాటారం :మండల కేంద్రంలో భారతీయ జనతాపార్టీ 45వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. అంబేద్కర్ కూడలిలో బీజేపీ మండలాధ్యక్షుడు పాగె రంజిత్‌కుమార్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. బీజేపీ శ్రేణులు కేక్ కట్ చేసి స్వీట్లు పంచి సంబరాలు జరిపాయి. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నేత చల్ల నారాయణరెడ్డి, మండల అధ్యక్షుడు రంజిత్ మాట్లాడారు. ఫిల్మ్ సెన్సార్ బోర్డ్ మెంబర్ దుర్గం తిరుపతి, బీజేపీ జిల్లా, మండల నాయకులు బొమ్మన భాస్కర్‌రెడ్డి, గంట అంకయ్య, రాజమౌళి, జిల్లెల్ల శ్రీశైలం, మంత్రి సునీల్, బొంతల రవి, మల్లారెడ్డి, స్వామియాదవ్, సుధాకర్, సతీష్ తదితరులు ఉన్నారు.

● ఏటూరునాగారం : బీజేపీ 45వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం మండల కేంద్రంలో ఘనంగా వేడుకలను నిర్వహించారు. బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు వినుకొల్లు చక్రవర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వై-జంక్షన్ వద్ద పార్టీ జెండాను ఎగురవేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు చక్రవర్తి మాట్లాడారు. కార్యక్రమంలో దళిత మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీరామరాజు నేత, దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు వావిలాల జనార్ధన్, జిల్లా కౌన్సిల్ సభ్యులు గద్దల హరిబాబు, మాజీ మండల అధ్యక్షుడు గాడిచర్ల రాజశేఖర్, అటిక కృష్ణ, చిటమట నరేష్ పాల్గొన్నారు.

● మంగపేట : బీజేపీ 45వ, ఆవిర్భవ దినోత్సవాన్ని పురష్కరించుకొని మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో బీజేపీ శ్రేణులు ఆవిర్భవ వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని బీజేపీ కార్యలయంలో బీజేపీ మండల అధ్యక్షుడు రావుల జానకీరావు పార్టీ జెండాను ఎగురవేసి బీజేపీ విశిష్టతను, దేశంలోని రాష్ట్రాలలో ఏవిధ ంగా విస్తరించిందో వివరించారు. కమలాపురం, గంపోనిగూడెం, కోమటిపల్లి, బోరునర్సిపురం, మల్లూరు, చెరుపల్లి, తిమ్మంపేట నర్సింహాసాగార్ చుంచుపల్లి రాజుపేట, రమణక్కపేట అకినేపల్లి-మల్లారంలలో ఆయా గ్రామాల్లో గ్రామాధ్యక్షులు బీజేపీ జెండాను ఎగురవేసి పార్టీ చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. అనంతరం గ్రామాల్లో బాణాసంచాలు కాల్చి స్వీట్లు పంపిణి చేసి సంబరాలు జరుపుకున్నారు. తదనంతరం మంగపేట, చుంచుపల్లి, బ్రాహ్మణపల్లి పిహెచ్‌సీలలో రోగులకు పండ్లు స్వీట్లు పంపిణి చేశారు. అదేవిధంగా మంగపేటలోని కస్తూర్బాగాంధి వృద్దాశ్రమంలో వృద్దులకు పండ్లు, పాలు స్వీట్లు పంపిణీ చేసి అన్నదానం చేయించారు. ఈ కార్యక్రమాలలో బీజేపీ జిల్లా కార్యదర్శి లింగంపల్లి శ్రీనివాసరావు, జిల్లా కౌన్సిల్ మెంబరు చల్ల రాంకీ, మండల అధ్యక్ష, కార్యదర్శిలు రావుల జానకీరావు, నిడుదవోలు శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షుడు, ప్రధానకార్యదర్శిలు రాంగాని నరేందర్, నరేందర్, బూర సుధాకర్‌గౌడ్, కిసాన్‌మోర్చ మండల అధ్యక్షుడు మద్దిని కృష్ణమూర్తి, మండల ప్రచారకార్యదర్శిలు కాసర్ల మల్లారెడ్డి, మినుగు తిరుపతి, గూండారాపు రోహిత్, శంకర్, కర్రి శ్రీనివాస్, సునిల్, సాయి గౌతమ్, ఇస్లావత్ శివకుమార్, తనుగు ప్రేమ్‌చంద్, మునుగు తిరుపతి తదితర బీజేపీ శ్రేణులు పాల్గొన్నారు.

● వెంకటాపురం : మండలకేంద్రంలో భారతీయ జనతాపార్టీ 45వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆదివారం మండలపార్టీ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా బీజేపీ జిల్లా నాయకుడు ఆట్లూరి రఘురాం పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పార్టీ సీనియర్ నాయకుడు సంకా వేమ సుందర్‌ను శాలువాతో సన్మానించారు. ఈకార్యక్రమంలో నాయకు లు బొల్లె సునీల్, సాధనపల్లి విజయ్, మోదాల సంతోష్, నోముల కిషన్, మట్టి రమేష్, నాగేంద్ర బాబు, చిట్టెం మురళి, తోట సతీష్, ఈశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

● వాజేడు : మండలకేంద్రంలో భారతీయ జనతాపార్టీ 45వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు పెద్ది జగపతిబాబు పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కందుల రాంకిషోర్, సీతారామరాజు, యాలం సుబ్బయ్య, కుర్సం కృష్ణమూర్తి, సంద్ర సోమరాజు, వినోద్‌కుమార్, శ్రీను, శేషు, తదితరులు పాల్గొన్నారు.



రేగొండలో బీజేపీ జెండా ఎగురవేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు నిశీధర్‌రెడ్డి